# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 05-10-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **సామాజిక న్యాయం, సాధికారత సాధనకు అంబేద్కర్, పూలే చూపిన మార్గాలు దోహదపడతాయని కేంద్రమంత్రి రాందాస్ అథవాలే పేర్కొన్నారు.**
2. **కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ రేపు రాష్ట్రంలో పర్యటిస్తారు.**
3. **జీఎస్టీ 2.0 దేశంలో ఒక పెను మార్పునకు శ్రీకారం చుట్టనుందని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు.**
4. **నెరవేర్చాల్సిన హామీలు, ప్రధాన సమస్యలను తన దృష్టికి తీసుకు రావాలని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ పార్టీ పార్లమెంటు, శాసనసభ సభ్యులకు సూచించారు.**
5. **విజయనగరం ఉత్సవాలు ఈరోజు నుంచి ప్రారంభమయ్యాయి.**

========================

దేశ ప్రజానీకానికి సామాజిక న్యాయం సాధికారత అందించడానికి అంబేద్కర్, పూలే చూపించిన మార్గాలు చైతన్యానికి దోహదపడతాయని కేంద్ర సాంఘిక న్యాయ, సాధికార శాఖ మంత్రి రాందాస్ అథవాలే అన్నారు. తిరుపతిలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, జ్యోతిరావు పూలే ఫౌండేషన్ నూతన కార్యాలయాన్ని కేంద్రమంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సన్మానసభలో కేంద్రమంత్రి రాందాస్ అథవాలే మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తోందన్నారు. ముఖ్యంగా అణగారిన వర్గాలను చైతన్యవంతులను చేసి వారిని సామాజికంగా, ఆర్థికంగా నిలబెట్టే ఎన్నో పథకాలను కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని తెలుపుతూ..

వాయిస్..33 సెకన్లు

------------------------

కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ రేపు రాష్ట్రంలో పర్యటిస్తారు. అమరావతిలో 12 బ్యాంకుల రాష్ట్ర ప్రధాన కార్యాలయాల నిర్మాణానికి కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేస్తారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. వీరి పర్యటన నేపథ్యంలో అధికారులు పటిష్ట, బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు.

------------------------

జీఎస్టీ 2.0 దేశంలో ఒక పెను మార్పునకు శ్రీకారం చుట్టనుందని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శ్రీకాకుళం నగరంలో గత రాత్రి నిర్వహించిన జీఎస్టీ ర్యాలీలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ.. జీఎస్టీ 2.0 సంస్కరణల వెనుక ముఖ్య ఉద్దేశం "ఆత్మనిర్భర్ భారత్"ను సాధించి, 2047 నాటికి భారతదేశాన్ని ప్రపంచంలోనే మొదటి స్థానంలో నిలబెట్టడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తెలుపుతూ..

వాయిస్..34 సెకన్లు

---------------------------

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో ధాన్యం సేకరణ కోసం 58 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ధాన్యం సేకరించిన 48 గంటలలోపు రైతుల ఖాతాలకు నగదును చెల్లిస్తామన్నారు. ఈ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఉపయోగించుకోవాలని ఆయన రైతులను కోరారు.

---------------------------

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న వైద్యుల డిమాండ్లను పరిష్కరించేందుకు ప్రభుత్వం సుముఖంగా ఉందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఆమోదయోగ్యమైన డిమాండ్లను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి తగిన నిర్ణయాన్ని తీసుకుంటామన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని క్యాంప్ కార్యాలయంలో వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు, వివిధ విభాగాలకు చెందిన అధికారులతో నిన్న సమావేశాన్ని నిర్వహించి పరిస్థితిని సమీక్షించారు.

---------------------------

ఐటీఐ పరీక్షల్లో జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ అభినందించారు. ఈ పరీక్షల్లో వివిధ ట్రేడ్ లకు చెందిన 17 మంది రాష్ట్ర విద్యార్థులు జాతీయ స్థాయిలో టాప్ ర్యాంక్ లు సాధించారని పేర్కొన్నారు. ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్ లో నిన్న నిర్వహించిన 'కౌశల దీక్షాత్ సమరోహ్' వేడుకలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నుంచి విద్యార్థులు పి.మధులత, డి.వందన, ఎస్.యామిని వరలక్ష్మి ధృవీకరణ ప్రతాలు అందుకున్నట్లు వెల్లడించారు. దేశ, విదేశీ కంపెనీలతో కలిసి విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందించేందుకు కృషి చేస్తామని చెప్పారు.

---------------------------

నెరవేర్చాల్సిన హామీలు, ప్రధాన సమస్యలను తన దృష్టికి తీసుకు రావాలని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ పార్టీ పార్లమెంటు, శాసనసభ్యులకు సూచించారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ శాసనసభా పక్ష సమావేశం నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. సభ్యులు ఎక్కడా ఎలాంటి విమర్శలు రాకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. త్వరలో జిల్లాల పర్యటనలు చేయనున్నట్లు పవన్ కళ్యాణ్ వెల్లడించారు.

---------------------------

జిఎస్టి తగ్గింపుతో ప్రతి కుటుంబానికి 15 వేలు ఆదా అవుతోందని జలవనరులశాఖ మంత్రి నిమ్మల

రామానాయుడు అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో గత రాత్రి జరిగిన కార్యక్రమంలో 29 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మంత్రి అందజేశారు.

మరో వైపు విజయవాడలోని గురునానక్ కాలనీ ఎన్టీఆర్ భవన్ లో పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ 42 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఈరోజు అందజేశారు. ఈ చెక్కులు కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదని, కష్ట కాలంలో కుటుంబాలకు కొత్త జీవితం అందించేందుకు అండగా నిలుస్తాయని ఈ సందర్భంగా కేశినేని శివనాథ్ పేర్కొంటూ..

..వాయిస్ .. 30 సెకన్లు

---------------------------

విజయనగరం ఉత్సవాలు ఈరోజు నుంచి ప్రారంభమయ్యాయి. నగరంలోని పైడితల్లి ఆలయం ఎదురుగా ఏర్పాటు చేసిన వేదికపై హోంశాఖ మంత్రి అనిత, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ జెండా ఊపి ఉత్సవాలను ప్రారంభించారు. ఉత్సవాల్లో భాగంగా వివిధ సాంస్కృతిక ప్రదర్శనలతో ర్యాలీ నిర్వహించారు. ఉత్సవాల ప్రారంభానికి ముందు పైడిల్లి అమ్మవారిని మంత్రులు, శాసన సభ్యులు, అధికారులు దర్శించుకున్నారు.

---------------------------

"ఆంధ్ర యువ సంకల్ప్ 2025 – అంబాసిడర్" డిజిటల్ మారథాన్‌లో పాల్గొనేందుకు పేర్లను నమోదు చేసుకునే గడువును ఈనెల 15వ తేదీ వరకూ పొడిగించినట్లు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా యువజన సర్వీసుల శాఖ జిల్లా ముఖ్య కార్య నిర్వహణ అధికారి నాగేశ్వరరావు తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థినీ.. విద్యార్థులు.. యువకులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు. వికసిత్ భారత్ 2047లో యువతను భాగస్వాములుగా చేసే లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

---------------------------

కోస్తా ప్రాంతం నుంచి రాయలసీమ, తమిళనాడు మీదుగా కొమొరిన్ ప్రాంతం వరకు అల్పపీడన ద్రోణి కొనసాగుతోందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. ద్రోణి ప్రభావంతో... రాష్ట్రంలో రాగల మూడురోజుల వరకు ఉత్తర కోస్తా, యానాంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ పేర్కొంటూ..

వాయిస్...27 సెకన్లు

=====================